13న ఆదివాసీ మహాగర్జన సభ

ప్రజాశక్తి - వేలేరుపాడు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈ నెల 13న జరిగే ఆదివాసీ మహాగర్జన బహిరంగ సభను మండలంలోని ఆదివాసీలందరూ ఐక్యంగా జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివాసీ జెఎసి ముఖ్యుల సమావేశం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో బంధం ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి గత నెల 24న బోయ వాల్మీకీలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. 13న సభకు ఆదివాసీ పెద్దలు, మేధావులు, జాతీయ, రాష్ట్రస్థాయి ఆదివాసీ నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు కారం దారయ్య, మడివి దుర్గారావు, ఊకే ముత్యాలరావు, సోడే సీతారామయ్య, మిరియాల శ్రీను, మడకం ఏసుబాబు, సోడే మోహన్, పిట్ట వీరయ్య, కారం బొజ్జి పాల్గొన్నారు.

చదువు 'కొనలేం'..!

తమ పిల్లలకు చదువు చెప్పించాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. ఎల్‌కెజి ఫీజు సైతం వేలల్లో, ఇంటర్ ఫీజులు రూ.లక్షల్లో ఉండటంతో చదువు కొనలేం అనే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు తయారైంది. ప్రయివేటు విద్యాసంస్థల ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ కొరవడటంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు చెప్పించేందుకు అప్పులు పాలవుతున్నారు.



ఎల్‌కెజికి రూ.15 వేల నుంచి రూ. 30 వేల వరకూ ఫీజు

ఇంటర్ ఫీజు రూ.రెండు లక్షలుపైనే

తమ విద్యాసంస్థలో చేరాలని విద్యార్థులపై కార్పొరేట్ల ఒత్తిడి

ఆలస్యమైతే సీట్లు ఉండవంటూ అడ్వాన్సులు సేకరణ

ఇళ్లకు విద్యాసంస్థల పిఆర్‌ఒల తాకిడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంలో జూన్ వచ్చే వరకూ విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలేవారు. వేసవి సెలవులు ముగిసే సమయానికి తమ పిల్లలను ఏ స్కూల్లో, ఏ కాలేజీలో చేర్చాలో తల్లిదండ్రులు ఆలోచించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం విద్యాసంవత్సరం పూర్తికాకుండానే వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు సాగిపోతున్నాయి. ఈ నెల 25 వరకూ ఈ విద్యాసంవత్సరం సాగనుంది. అయితే ఇప్పటికే పలు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు వచ్చే ఏడాదికి సంబంధించిన అడ్మిషన్లు పెద్దఎత్తున సాగిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచే కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు తమ పిఆర్‌ఒలను ఏర్పాటు చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి ప్రారంభించాయి. తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి మీ బిడ్డను మా సంస్థల్లోనే చేర్చండి అంటూ టార్చర్ పెడుతున్న పరిస్థితి ఉంది. తమ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చాలని మాయమాటలతో వలలో వేసుకుంటున్నారు. జిల్లాలో వెయ్యికిపైగా కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు ఉన్నాయి. దీనిలో ప్రాథమిక విద్య స్కూల్స్ 202 వరకూ ఉండగా, ప్రాథమికోన్నత పాఠశాలలు 422, హైస్కూళ్లు 440 ఉన్నాయి. ఇంటర్ కాలేజీలు సైతం పెద్దసంఖ్యలో ఉన్నాయి. వీటిలో చిన్నస్థాయి స్కూళ్లలో సైతం ఎల్‌కెజి ఫీజు రూ.15 వేలు వరకూ ఉండగా, పెద్ద స్కూళ్లలో ఎల్‌కెజి ఫీజు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఉన్నాయి. ఇంటర్ చదువుకు ఏడాదికి రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్నాయి. డేస్కాలర్ ఇంటర్ కాలేజీలు ఏడాదికి రూ.40 వేలకుపైగా గుంజుతున్నాయి. జిల్లాలో ఉన్న కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు కాకుండా విజయవాడ, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన విద్యాసంస్థల పిఆర్‌ఒలు సైతం జిల్లాలో పెద్దఎత్తున విద్యార్థులను తమ విద్యాసంస్థల్లో చేర్చాలని ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఇంటర్ విద్య బలహీనంగా ఉండటంతో తల్లిదండ్రులు ప్రయివేటు విద్యాసంస్థల మాయమాటలకు ఆకర్షితులవుతున్నారు. ఒకరిని చూసి మరొకరు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లలో చేర్పిస్తున్నారు. అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరు నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు సైతం చేసేశారు. లోలోన మాత్రం పిల్లల చదువులపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నలిగిపోతున్నాయి. చదువు కొనలేని స్థితికి చేరడంతో పేద విద్యార్థులు హైస్కూల్ విద్యతోనే స్వస్తి పలుకుతున్న పరిస్థితి ఉంది. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ కొరవడటంతో ప్రయివేటు విద్యాసంస్థలు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు తయారైంది.

మొదటి పది మందికే ర్యాంకులు.. మిగిలిన విద్యార్థుల పరిస్థితీ అంతే

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో చేరే విద్యార్థుల్లో మొదటి పది, 20 మందికే ర్యాంకులు వస్తున్నాయి. మిగిలిన విద్యార్థుల గురించి అసలు పట్టించుకోని పరిస్థితి ఉంటుంది. మొదటి పది ర్యాంకుల పేరుతో ప్రచారం ఊదరగొట్టి తల్లిదండ్రులను మాయచేస్తున్నారు. బాగా చదివే పిల్లలకు ఫీజుల తగ్గించి చేర్చుకుని వారిపైనే ఫోకస్ పెడుతున్నారు. అలాంటి విద్యార్థులు ఎక్కడ చదవినా ర్యాంకులు వచ్చే అవకాశం ఉంటుంది. ఆ పదిమంది మార్కులను చూపించి మోసగిస్తున్నారు. డేస్కాలర్ ఇంటర్ కాలేజీలో చేరే విద్యార్థులకు 98శాతం మందికి ఎంసెట్ ర్యాంకు కూడా రావడం లేదు. హాస్టల్లో రూ.రెండు లక్షలు చెల్లించి చేరిన విద్యార్థులకు జెఇఇ మెయిన్స్ సంగతి పక్కనపెడితే ఎంసెట్ ర్యాంకు రాని విద్యార్థులు పెద్దఎత్తున ఉంటున్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తూ జేబులు కొల్లగొడుతున్న పరిస్థితి ఉంది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా స్కూళ్లు, కాలేజీల్లో చేరినప్పుడు ఒకలా.. తర్వాత మరోలా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. పుస్తకాలు, బెల్టులు, బూట్లు, నుంచి అన్నీ స్కూల్, కాలేజీల్లోనే కొనుగోలు చేయాలి. వారు ఎంత చెబితే అంతకు తీసుకోవాలి. ఏమిటని ప్రశ్నిస్తే అలాగైతేనే చదువు వస్తుందని హుకుం జారీ చేస్తారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ : ఘనంగా పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

సామాజిక దార్శనికుడిగా, సంఘ సంస్కర్తగా, వివక్షలేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పూలే ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, వారి ఆశయాలను సాధించడమే వారికి నిజమైన ఘన నివాళి అని అన్నారు. విద్యతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని అన్నారు. మహిళాభ్యున్నతికి, బాలికా విద్యావ్యాప్తికి వారు చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ రవికుమార్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, పలువురు బిసి సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జెసి లావణ్యవేణి

గొప్ప సాంఘిక సంస్కర్త పూలే

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

సమాజంలో అసమానతలు రూపుమాపి, సమానత్వాన్ని పెంపొందించిన గొప్ప సాంఘిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే 197వ జయంతిని స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెసి లావణ్యవేణి జ్యోతి వెలిగించి, పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లావణ్య వేణి మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి అని నమ్మి, మహిళల విద్యాభివృద్ధికి పూలే కృషి చేశారని, మహిళల విద్య కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం గురించి మహాత్మా జ్యోతిరావుపూలే ఎంతో కృషి చేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఇంకా సాంఘిక వెనుకబాటుతనం, మూడాచారాలు, అగ్రకులాల ఆధిపత్యం ఇంకా కొనసాగడంపై మనం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజాన్ని ప్రభావితం చేస్తున్న వెనుకబాటుతనాన్ని పారదోలేందుకు పూలే అందించిన స్ఫూర్తితో ప్రతి మహిళా తప్పనిసరిగా డిగ్రీ వరకైనా విద్య అభ్యసించాలన్నారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ మాట్లాడుతూ అణగారిన ప్రజల అభివృద్ధిని జ్యోతిరావుపూలే కాంక్షించారన్నారు. మహిళల అక్షరాస్యత, విద్యాభివృద్ధికి మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు నేతల అజయ్‌బాబు, వివిధ సంఘాల నాయకులు మెండెం సంతోష్‌కుమార్, వీరన్న, దేవరకొండ వెంకటేశ్వర్లు, చిలకపల్లి కట్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, మెప్మా పీడీ ఇమ్మానియేల్, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ జె.జానకీరెడ్డి, బిసి ఎంప్లాయీస్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్‌పిఆర్.విఠల్‌కుమార్, జనరల్ సెక్రటరీ పి.ఏసురాజు, నేతల రమేష్ బాబు పాల్గొన్నారు. అనంతరం పూలే జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి రవి, నేతలు

సామాజిక విప్లవకారుడు పూలే

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

సామాజిక విప్లవకారుడు, సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారుడిగానే కాకుండా, కుల వివక్షకు వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు విడిచే వరకూ పోరాడారని కొనియాడారు. సావిత్రిబాయి ద్వారా పాఠశాలలను స్థాపించి మహిళలు, అణగారిన వర్గాలకు విద్యను అందించారని అన్నారు. శ్రమజీవుల కోసం 1855లోనే రాత్రి బడులు స్థాపించి నిరక్షరాస్యతను పారదోలే దార్శికునిడయ్యాడన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా అంటరాని వాళ్లకు తన ఇంట్లోనే నీళ్ల బావి నిర్మించారని గుర్తు చేశారు. కుల వ్యవస్థ అనేది శ్రమజీవుల వర్గ దోపిడీకి కారణమని ఆ రోజుల్లోనే విశ్లేషించాడన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరలా ఆనాటి కుల వివక్ష, అసమానతలను తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. మనుధర్మ శాస్త్రంను సంప్రదాయాల పేరుతో నేడు ప్రజలపై బలవంతంగా రుద్దాలని చూస్తోందని విమర్శించారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న కుల వ్యవస్థ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే జ్యోతిరావు పూలే వంటి మహనీయులకు ఇచ్చే ఘన నివాళి అని రవి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గుడిపాటి నరసింహారావు, బి.సోమయ్య, పివి.రామకృష్ణ, ఎస్.మహంకాళి, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వివిఎన్.ప్రసాద్, జె.గోపి, మంచెల్ల ఇస్సాక్, కట్టా సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, బి.త్రినాథ్, రాజశేఖర్, జి.శారద పాల్గొన్నారు.



యుటిఎఫ్ కార్యాలయంలో ఎంఎల్‌సి సాబ్జీ

పూలే ఆశయ సాధనే నిజమైన నివాళి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

జ్యోతిబాపూలే ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి అని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పూలే ఆశించినటువంటి సమసమాజ స్థాపన నేటికీ ఆదర్శనీయమని, దానికోసం అంతా కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ అంకితభావంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో యుటిఎఫ్ సామాజిక స్పృహతో పని చేస్తూ సామాజిక అంతరాల నివారణకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ మహిళల్లో సామాజిక చైతన్యానికి మారుపేరుగా నిలిచి, మహిళల సామాజిక చైతన్యానికి తన భార్యను ఆదర్శంగా తీర్చిదిద్దిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫాలీ, కార్యదర్శులు ఎస్.సుధారాణి, ఇ.శివశంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, నాయకులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలివ్వాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ కార్మికుల మార్చి నెల జీతం, మూడు నెలల బకాయి హెల్త్ అలవెన్స్, విలీన పంచాయతీ కార్మికులకు జూన్2022 జీతం ఇవ్వాలని కోరుతూ బాధిత కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ మార్చి నెల జీతం ఏప్రిల్ 10వ తేదీ వచ్చినా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు వైఎస్ఆర్ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ హామీ అమలు చేయకపోగా వారి జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌కు అప్పగించి వారి ద్రోహం చేశారన్నారు. స్కూల్ స్వీపర్లకు నాలుగు నెలల బకాయి జీతాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు పదో పిఆర్‌సి రూ.62 లక్షలు బకాయి ఎరియర్స్ ఇవ్వాలని, ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని చీపుర్లు, గంపలు, పాడైపోయిన బండి రిపేర్ చేయాలని, డబ్బాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, లావేటి కృష్ణ, ఎం.గోపి, జార్జి, జయకర్, కార్తీక్ అప్పలరాజు, బంగారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నినదిస్తున్న కార్మికులు

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో రైతు ఉద్యమాలు

ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ

ప్రజాశక్తి - దెందులూరు

రైతు ఉద్యమ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోతునూరులో లైబ్రరీ సెంటర్ వద్ద ఎఐకెఎస్ జెండాను ఎగురవేశారు. రైతాంగ పోరాట యోధుడు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తికి, రైతుఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ నాటి జాతీయోద్యమం నుండి నేడు మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర వహించిందని వివరించారు. ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతురుణ విమోచన చట్టం సాధన కోసం రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, నేతలు చల్లా బాలస్వామి, నరహరిశెట్టి సోమరాజు, తేరా ఎలీషారావు, వరిగంజి తంబి పాల్గొన్నారు.

ఏలూరు: రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర అందేలా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ 88వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక అన్నే భవనం వద్ద ఎఐకెఎస్ జెండాను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.జీవరత్నం, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళి, పి.గోపి, టి.ముత్యాలమ్మ పాల్గొన్నారు.

13న జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఈ నెల 13న జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన ఈ నెల 13న గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరగనున్న సమావేశంలో పేదలందరికీ ఇళ్లు, ఉపాధిహామీ, ప్రాధాన్యతా భవనాలు, నాడు-నేడు, తాగునీరు సరఫరా, సమ్మర్ యాక్షన్ ప్లాన్, వ్యవసాయం అనుబంధ శాఖలు, ధాన్యం సేకరణ, ఆరోగ్యం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై సమీక్షించనున్నారు.

కొల్లేరువాసుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఎంఎల్‌సి జయమంగళ వినతి

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రైతులతో కలిసి జయమంగళ వెంకటరమణ వినతిపత్రాన్ని సమర్పించారు. కొల్లేరు సరస్సు ఏరియాలో ప్రభుత్వం స్వాధీనపర్చుకున్న జిరాయతీ భూములకు, షరతు పట్టా భూములకు నష్టపరిహారం చెల్లించాలని, కొల్లేరు సరస్సు ప్రాంతంలోని ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని, 1999 అక్టోబర్ 5న నోటిఫికేషన్ విడుదలయ్యేనాటికి ఉన్న రహదారులకు తగినన్ని మార్గాలు ఏర్పాటు చేసి, అన్ని ప్రధాన జనావాసాలను కలుపుతూ ఉన్న రోడ్ల నిర్వహణ, కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణపై ఆయా శాఖల అధికారులకు సూచనలు జారీ చేయాలని కోరారు. నోటిఫికేషన్‌లో కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరు అభయారణ్యం విస్తీర్ణంలో అధికంగా మార్కింగ్ చేసిన భూమిలో రైతుల భూములను రైతులకు అప్పగించాలని, మిగిలిన భూమిని భూమిలేని నిరుపేదలకు అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

సాగులో భూసార పరీక్షా ఫలితాలు కీలకం

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయ సాగులో భూసార పరీక్షా ఫలితాలు కీలక పాత్ర వహిస్తాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ అన్నారు. భీమడోలులో భూసార పరీక్షా వారోత్సవాల కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో భీమడోలు కేంద్రంగా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రామకృష్ణ మాట్లాడుతూ భూసార పరీక్షా వారోత్సవాలు జిల్లాలో ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జిల్లా పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సహాయకులు స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. వారోత్సవాలను డివిజన్, మండల, రైతుభరోసా కేంద్రాలవారీగా నిర్వహిస్తారన్నారు. జిల్లా పరిధిలోని 540 రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరీక్ష అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. గతంలో సైతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించేవారని, అయితే వివిధ కారణాల వల్ల వాటి ఫలితాలు రైతులకు అందడంలో జాప్యం జరిగేదని అన్నారు. ఐదెకరాల విస్తీర్ణంలో ఒక మట్టి నమూనా వంతున సేకరించి వాటి ఫలితాలను విశ్లేషించి రైతులకు అందజేస్తామన్నారు. మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం ఈ విధమైన పరీక్షలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే జిల్లా పరిధిలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం జిల్లాస్థాయి వర్క్‌షాప్‌కు హాజరైన వ్యవసాయాధికారులకు భూసార పరీక్షల నిర్వహణపై విధివిధానాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన జిల్లాస్థాయి వ్యవసాయాధికారులు లలితా సుధ, వ్యవసాయ శాస్త్రవేత్త ఫణికుమార్, సోమశేఖర్, భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన

దెందులూరు: రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, రైతులకు గోనె సంచులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పోతునూరు, సత్యనారాయణపురం, కొవ్వలి గ్రామాల్లో ఎపి రైతుసంఘం నాయకులు పర్యటించి కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని నినదిస్తూ కల్లాల్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజుల నుంచి రబీ ధాన్యం కోతలు జరిగి కల్లాల్లో ధాన్యమున్నా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం అన్యాయమని విమర్శించారు. ఒకవైపు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ధాన్యం ఉండిపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ నెల 15 తర్వాత కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని అధికారులు ప్రకటిస్తున్నారని, ఈలోపు వర్షాలు పడితే రైతులు నష్టపోతారని చెప్పారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. రైతులకు గోనె సంచులు వెంటనే సరఫరా చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సున్నా వెంకట్రావు, గండి రాజా, చల్లా బాలస్వామి, బోయిన వెంకట నాగబాబు, పి.కాంతారావు, చల్లా తంబి, లింగాల వైకుంఠం, ఉమ్మడి నరేష్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుదాం

సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలని సిపిఎం, సిపిఐ పిలుపునిచ్చాయి. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఈ నెల 14 నుంచి చేపట్టనున్న ప్రచార భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను సాగనంపడం కోసం ఈ నెల 14 నుండి 30వ తేదీ వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక నియంతృత్వ విధానాలతో ప్రశ్నించే గొంతుకలు, పక్షాలపై ఉక్కు పాదం మోపుతుందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లలో కేంద్ర ప్రభుత్వం కోతలు విధించి తీరని అన్యాయం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలను దృష్టి మళ్లించడానికి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశంలో లౌకిక పరిరక్షణకు తూట్లు పొడు స్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా సిపిఐ, సిపిఎం ఈ నెల 14 నుండి 30వ తేదీ వరకు పట్టణ ప్రాంతాలలో పాదయాత్రలు, పల్లెలోల ఆటో యాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నేతలు పుప్పాల కన్నబాబు, మావూరి విజయ, జి.స్వాతి, సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, నేతలు కె.శ్రీనివాస్, మానుకొండ జీవరత్నం, పి.చంటి పాల్గొన్నారు.

నేడు ఎస్‌పిగా మేరీ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రవ్యాప్తంగా ఐఎఎస్ ఐపిఎస్ బదిలీలు పెద్దఎత్తున నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మను బెటాలియన్‌కు, విజయవాడ డిసిపిగా పని చేస్తున్న డి.మేరీప్రశాంతిని ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. జిల్లా ఎస్‌పిగా మేరీ ప్రశాంతి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జాతీయ రహదారిపై ధాన్యం ఆరబోత

ప్రజాశక్తి - ఉంగుటూరు

రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

దాళ్వా కోతలు మండలంలో ప్రారంభమయ్యాయి. తేమ శాతం నుంచి బయట పడేందుకు కల్లాలు లేకపోవడంతో జాతీయ రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపక్కనే ఉంటూ ధాన్యం రాసులను ఆరబెట్టుకుంటున్నామని రైతులు రామారావు, సుబ్బారావు తెలిపారు. వరి కోతలు ప్రారంభమైనా నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కర్షకులు దిగాలు చెందుతున్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు గ్రామంలో పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి పది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణరావు మాట్లాడుతూ పంచాయతీలో నిధులు లేవని అధికారులు ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ పివిపి.ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. ఆ సమయంలో గ్రామ పంచాయతీ విజిట్‌కు వచ్చిన జిల్లా అధికారి డిఎల్‌పిఒ మణికి వినతిపత్రం అందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి -ద్వారకాతిరుమల

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమల నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన భోగిపల్లి రమేష్ మంగళవారం రూ.1,00,116 విరాళంగా దేవస్థానం సూపరింటెండెంట్ ఐ.రమణరాజుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదాన బాండ్ పేపర్ అందించారు.

కొక్కిరపాడులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ఏలూరు టౌన్ :గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 124వ రోజు పెదపాడు మండలం కొక్కిరపాడులోని ప్రతి గడపకు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయచౌదరి వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు.

'భీమడోలులో 19న...

భీమడోలు : ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు ఈనెల 19వ తేదీన భీమడోలులో నిర్వహించనున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో పూర్తిస్థాయి వివరాలతో సిద్ధం కావాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన ఇతర సిబ్బంది, ప్రముఖులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చెరువులను నింపాలి

ఉంగుటూరు :మండలంలోని వేసవిలో తాగునీటి సమస్యలను అధిగమించాలంటే గ్రామాల్లో చెరువుల్లో నీటిని పూర్తిగా నింపుకోవాలని పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ అన్నారు. రావులపర్రు, బొమ్మిడి, దొండపాడు, కార్యదమల్లి, వివిధరం, తోటరామచంద్రపురం, రాచూరు, సీతారాంపురం గ్రామాలను ఆయన మంగళవారం సందర్శించారు. మరో మూడు రోజుల్లో గోదావరి నీటి సరఫరాను ఆపేయనున్నారని, ఈలోపే అన్ని చెరువులను నిండుగా నింపుకోవాలని సంబంధిత పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు మార్గదర్శకాలు ఇస్తున్నామన్నారు.

పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు వేలం వాయిదా

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీరేవు టెండర్ కం వేలం పాట అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2034 సంవత్సరానికి టెండర్ కం వేలం ఈ నెల 11వ తేదీ నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీన మళ్లీ సీల్డ్ టెండర్లు ఆహ్వానించి వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బస్ ఛార్జీలు తగ్గించాలి : వ్యకాస

ముదినేపల్లి :పెరిగిన బస్ ఛార్జీలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. ఢిల్లీలో జరిగిన సభలకు వెళ్లివచ్చిన అనంతరం మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి గుడివాడ గతంలో రూ.45 ఉన్న బస్‌ఛార్జీ, ఇప్పుడు రూ.85 పెరిగిందన్నారు. పెరిగిన ఛార్జీలతో సామాన్య ప్రజలు ప్రయాణాలు చేయాలంటే జంకుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బస్‌ఛార్జీలు తగ్గించాలని, లేకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో చెరువు కాపలాదారుడు మృతి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుదాఘాతంతో రొయ్యల చెరువుపై కాపలాదారుడు మృతి చెందిన ఘటన నచ్చిమిల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన ఆనేశ్వర్ (20) బైరవపట్నానికి చెందిన సజ్జ బాబికి చెందిన రొయ్యల చెరువుపై గత 15 రోజుల నుంచి కాపలాదారునిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం చెరువు గట్టు మీద పిట్టల వాలకుండా ఉండేవిధంగా ఏర్పాటు చేసిన వైర్లను సరిచేస్తున్న సమయంలో విద్యుత్‌వైర్లు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. ఆనేశ్వర్‌ను కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఆనేశ్వర్ బంధువులు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు

జీలుగుమిల్లి :భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పి.రావారం గ్రామానికి చెందిన నాగేంద్ర, సుధారాణి దంపతుల కుమార్తె కొయ్యలగూడెం హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో మార్చి 29వ తేదీ సాయంత్రం సుధారాణి కుమార్తెను చూసి వస్తానని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె భర్త నాగేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మండవల్లిలో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి -మండవల్లి

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విజిలెన్స్ ఎస్ఇ ఎం ఆల్ఫాన్స్ అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండవల్లి మండలంలో మంగళవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలంలో గృహ వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జీలుగుమిల్లి శివారు జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్య ద్వారా సమాజం పురోభివృద్ధిని సాధిస్తుందని ఆచరణలో రుజువు చేసిన మహనీయులు జ్యోతిరావుపూలే అని పలువురు వక్తలు ఉద్ఘోధించారు. ఆధునిక భారత సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే 196వ జయంతి బిసి సబ్ ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్.పేటలోని వేదిక జిల్లా కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు నాయకులు వి.కిషోర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిసి సబ్ ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడారు.

నగరంలోని జెడ్‌పి కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కాశీకృష్ణ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి ఉభయగోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ బయ్యారపు రాజేశ్వరరావు హాజరై మాట్లాడారు.

భీమడోలు : ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు సూచన మేరకు వైసిపి నేతలు గుండుగొలను కేంద్రంగా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పి.సునీత మాన్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొయ్యలగూడెం :కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణిచివేతకు గురైన దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి సాధికారత కల్పనకు కృషి చేసిన గొప్ప సంస్కర్త జ్యోతిరావుపూలే అని సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు అన్నారు. పూలే జయంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.శివకుమార్, మర్రి త్రిమూర్తులు, సిపిఎం నాయకులు సిహెచ్.మరిడియా, జి.గోపి, దుర్గారావు, ముప్పిడి సురేష్ పాల్గొన్నారు.

చింతలపూడి : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావుపూలే అని యుటిఎఫ్ నాయకులు అప్పారావు, దామోదర్, పిఆర్‌టియు నాయకులు కోడూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో మేడబడి వద్ద పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా పాల్గొన్నారు.

చాట్రాయి : కెవిపిఎస్ చిన్నంపేట గ్రామ కమిటీ, జై భీమ్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం అంబేద్కర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ చాట్రాయి మండల కమిటీ కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్ము నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కొమ్ము చంటి పాల్గొన్నారు. మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఎస్.నీలిమ, ఉపాధ్యాయులు మెరీనారాణి, సాయిసుధా, రాజేశ్వరి, రత్తయ్య పాల్గొన్నారు.

ముసునూరు : కుల వ్యవస్థ నిర్మాలనకు జ్యోతిరావుపూలే విశేష కృషి చేశారని సిల్క్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పాఠశాలల్లో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహాశీల్దార్ దాసరి సుధ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కైకలూరు : టిడిపి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఆధ్వర్యంలో పట్టణంలోని కోరుకొల్లు సెంటర్లో పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ముదినేపల్లి : పూలే జయంతి వేడుకలు ముదినేపల్లిలో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి గౌరవ అధ్యక్షులు పివి.రమణ, గౌరవ కార్యదర్శి నిమ్మగడ్డ భిక్షాలు, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షులు పళ్లెం పుణ్యేశ్వరరావు, కార్యదర్శి జన్ను వీర వెంకటేశ్వరరావు, కోశాధికారి ఈడే శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఈడే నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ మంగినేని బాబ్జి పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

చాట్రాయి : మండలంలోని పర్వతపురం గ్రామంలో నాలుగు రోడ్ల కూడలిలో పూలే చిత్రపటానికి టిడిపి నాయకులు పర్వతనేని గంగాధర్ పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలైన బొర్రా వెంకటేశ్వరరావు, కందిమల్ల కృష్ణవేణి, చీపు రావులమ్మ, కల్లేపల్లి ప్రకాష్‌లకు ఒక్కొక్కరికి రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. చీపురుగూడెం గ్రామం మంగపేటకుచెందిన రేగుల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.పది వేలు అందించారు.

మండవల్లి : ప్రధాన సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే చిత్రపటానికి మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్ఎస్.భాస్కరరావు, ట్రెజరర్ దాసరి యోహానురాజు, గ్రంథాలయ అధికారిని షేక్ పర్వీన పాల్గొన్నారు.

నూజివీడు : పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలో కొనసాగే డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.వెంకటరాము పూలమాల వేసి నివాళి అర్పించారు.

పోలవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పూలే చిత్రపటానికి . ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ ప్రేమచంద్, కంప్యూటర్ ఆపరేటర్ హరే రామ్ పాల్గొన్నారు.

చేబ్రోలులో సీసీ డ్రెయిన్లు

ఉంగుటూరు :చేబ్రోలు పంచాయతీలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నామని సర్పంచి రాంథే లక్ష్మీసునీత తెలిపారు. స్థానిక ముస్లిం ఏరియాలో కచ్చా డ్రెయిన్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిధుల కోసం ప్రయత్నించినా సాకారం కాకపోవడంతో పం చాయతీ జనరల్ ఫండ్ నుంచి రూ.25 లక్షలతో మూడు చోట్ల 320 మీటర్ల సిమెంటు డ్రెయిన్లు చేపట్టామని తెలిపారు.

13న భూ సదస్సు

ఆగిరిపల్లి :ఈ నెల 13న ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే భూ సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సఘం మండల కార్యదర్శి ఈపూరి రవీంద్ర కోరారు. మండలంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని, జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచి, కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లను అమర్చవద్దని నినాదాలతో మండలంలో ప్రచారజాతా నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు, చాకిరి శివనాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్తకు నిప్పు.. ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - మండవల్లి

చెత్తను తగలబెట్టడంతో కమ్ముకున్న పొగ

పంచాయతీ అధికారుల విధి నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి తీరుతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై ఉన్న చెత్తను సంపద కేంద్రానికి తరలించకుండా రహదారిపైనే తగలబెట్టేస్తున్నారు. దీంతో భారీ స్థాయిలో కాలుష్యం వెదజల్లడంతో పాటు దట్టమైన పొగ ఏర్పడడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారితో పాటు గ్రామంలోని పలు ప్రాంతాలు చెత్తకుప్పలకు నిలయం అయిపోయాయి. దీంతో ఆ చెత్తకుప్పల నుంచి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తికి నిలయాలుగా మారాయి. దీనిపై చెత్త రహదారులు శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎవరు ఏమి ఆదేశించారో ఏమో కాని చెత్తను సంపద కేంద్రానికి తరలించకుండా పంచాయతీ కార్మికులు దగ్గరుండి చెత్తకుప్పలకు నిప్పంటించి తగలబెట్టేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో జాతీయ రహదారిపై దుర్వాసన వెదజలే దట్టమైన పొగ అలముకుంది. దీంతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. గ్రామానికి ఆదాయం సమకూర్చే విధంగా సంపద తయారు చేసే విధంగా కేంద్రానికి చేరుకోవాల్సిన చెత్త అధికారుల నిర్లక్ష్యంతో కాలి బూడిదైందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులపై చర్యలు తీసుకుని మండవల్లి మండల కేంద్రాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. రహదారిపై చెత్తను తగలబెడుతున్న విషయంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఏ అధికారీ అందుబాటులోకి రాలేదు.

17న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరుటౌన్ :రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో సహకార సంఘ ఉద్యోగులంతా పాల్గొనాలని సహకార సంఘాల ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదే చట్ట సవరణలో ఆర్‌బికెలను సహకార సంఘాల్లో విలీనం చేయొచ్చనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు చేపట్టే ధర్నాలో ఉద్యోగులంతా పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు, జిల్లా కార్యదర్శి పి.సుబ్బారావు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం'

ద్వారకాతిరుమల :వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమనిటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ముగింపు సభ మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రత్తిపాటి పుల్లారావు, కెఎస్.జవహర్, గన్ని వీరంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - నూజివీడు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 14వ తేదీన నూజివీడు పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయినట్లు టిడిపి నేతలు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు సభాస్థలిని మంగళవారం పరిశీలించారు. నూజివీడులో టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు చిత్రపటం ముద్రించిన ఫ్లెక్సీలు మాత్రమే కనిపించాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. పార్టీని విభజించే రీతిలో సమావేశాలు పెడితే సహించేది లేదన్నారు.

'మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యం దిశగా జగనన్న పాలన సాగుతోందని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ముక్కొల్లుపాడులో ఉన్న వేంపాడు కాలవలో నుంచి మట్టి అక్రమ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు నూజివీడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి తెలిపారు. మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవికాలంలో ప్రజలు వైరల్ ఫీవర్స్, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజల అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జయగోవింద సూచించారు. స్థానిక పెదవేగి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'

నూజివీడు రూరల్

మండలంలోని రేగుంట గ్రామంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ గుమ్మల్ల కృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో కలిసి ఇంటింటికి పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రజలకు అనేక వినూత్నమైన సంక్షేమ పథకాలు అందిస్తూ దేశానికి ఆదర్శనీయంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నారాయణపురంలో టూరింగుపేట, కొబ్బరితోటలో పర్యటించారు.

చాట్రాయి : మండలంలోని పర్వతాపురంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లి : మండలంలోని పెదపాలపర్రు, ముదినేపల్లి పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరారావు పాల్గొని మాట్లాడారు..

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

జంగారెడ్డిగూడెం :అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాలపద్మ సూచించారు. జంగారెడ్డిగూడెం ఐసిడిఎస్ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి సెక్టార్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU
E.P.10/2019, O.S.55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.27-04-2023 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయ బడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు: Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., within the following boundaries.
EAST: Land of Kadaganchi Lakshmi
SOUTH: Land of Balda Manikyamma
WEST: Land of Ramini China Venkateswara Rao, **NORTH:** Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
D.Hr Value - more than five lakhs
Amin Value - Rs.2,33,000/-

Eluru **S.BRAHMAM,** Advocate,
Dt.11-04-2023 Eluru. Cell: 94929 32214

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 723/2022
ఓ.ఎస్.నెం. 277/2015

బిట్వీన్:
భీమవరపు సురేష్ కుమార్ ...వాది
మరియు
కర్నాటి కాంతమ్మ వగైరాలు ...ప్రతివాది
టు:
ఆర్-8: గండికోట నితిన్ కుమార్, తండ్రి: (లేటు) శ్రీనుబాబు, డో.నెం. 28-3-160/2, ఫిరంగుల దిబ్బ, 24వ డివిజన్, ఏలూరు, ఏలూరు జిల్లా.
ఆర్-9: పోట్రు జయలక్ష్మి, భర్త: (లేటు) దుర్గారావు, డో.నెం. 28-3-160/3, ఫిరంగుల దిబ్బ, 24వ డివిజన్, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో మిమ్మల్ని చనిపోయిన 3వ ప్రతివాది అయిన గండికోట శ్రీనుబాబు గారి వారసులుగా చేర్చమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున మీకు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు మీకు ఈ పత్రికా ముఖంగా నోటీసు అమలుకు ఆర్డరు అయి ఉన్నది. కావున వాయిదా తేదీ **ది. 13-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరవగలరు.** లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.వి.నాగేశ్వరరావు
వి.అమర్‌శ్రీనివాస్,
న్యాయవాదులు, ఏలూరు.

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.41/2017, ఒ.ఎస్.నెం.59/2016

బిట్వీన్:
దాసరి చిన్నమనాయుడు & others **...డిక్రీ హోల్డర్**
మరియు
శ్రీ పోసా శ్రీనివాస్ **...జడ్జిమెంట్ డెటార్**

పై నెంబరు వారంటు గ్రంథములో డిక్రీ హోల్డరు తన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసిన ఇ.పి. గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ తెలియపరిచిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టులో **ది.24-04-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు బహిరంగముగా వేలము వేయుదురు.** కావలసిన వారు సదరు వేలములో పాల్గొని నియమ నిబంధనల ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్థిని పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి: ***ఎ-షెడ్యూలు:*** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సబ్ రిజిష్ట్రీ యిలాకా, ఏలూరు పట్టణం, గాంధీ నగరం, శేఖర్ వీధి, బ్లాక్ నెం.10, మున్సిపల్ ఇ-వార్డు టి.యస్.నెం.320 మరియు 954ర్లు దాఖలా చ॥గ॥224-6-0లో దక్షిణం వైపు చ॥గ॥44-0లు స్థలములో పడమర వైపున గల చ॥గ॥22-0-0లు స్థలము, అందులో గల డో.నెం. 20బి-10-17రు గల రేకుల షాపునకు హద్దులు:
తూర్పు: పోసా జయవెంకటరెడ్డి గారి ఆస్థి అ॥10-0లు.
దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥19-5లు.
పడమర: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥10-0లు.
ఉత్తరం: జడ్జిమెంటు డెటార్ గారి తాలూకు ఆస్థి, పోసా జయ వెంకటరెడ్డి గారి ఆస్థి అ॥19-5లు.
డిక్రీ హోల్డర్ కిమ్మత్తు : రూ.2,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.4,30,000/-

టి.సుబ్బరాయ శర్మ
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
10-04-23. సెల్: 94401 83248

ఇసుక రవాణాకు అనుమతి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం రెండు రోజుల పాటు అనుమతులు జారీ చేస్తున్నట్లు తహాశీల్దార్ దాసరి సుధ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ఎల్లాపురం ఇసుక ర్యాంపు నుంచి 11, 12 తేదీల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇసుక ట్రాక్టర్ల ద్వారా తోలు కోవడానికి అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పార్కిన్సన్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వై.హేమాచౌదరి పిలుపునిచ్చారు. ప్రపంచ పార్కిన్సన్స్ డే సందర్భంగా జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వసామాజిక ఆసుపత్రిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వై.హేమాచౌదరి, సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల పునారావాస కేంద్రం సిబ్బంది పిఒ రాజకుమార్, ఫిజియోథెరఫీ జి.రాంబాబు, కె.నాగరాజు, పి.జయలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేషన్ కె.రేష్మిత, క్రాంతి శ్రీ పాల్గొన్నారు.

'బిసి కుల గణన చేపట్టాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దేశంలో బిసి కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా పట్టణంలోని ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో జయంతి వేడుకలు, బిసిల ఆత్మీయ సదస్సును బిసి సాధికార సమితి ఆధ్వర్యంలో అఖిలభారత గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణ, వివిధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, బిసి ప్రముఖులు హాజరయ్యారు.

చదువులో రాణిస్తేనే భవిష్యత్తు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు చదువులో రాణిస్తే, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లవచ్చని చింతలపూడి ఎంపిపి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఎంపియుపి పాఠశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. చదువుపై శ్రద్ధ పెట్టాలని, సందేహాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **ఆలమూరి గాంధీ గారి భార్య ఆలమూరి శ్రీదేవి,** అత్తిలి గ్రామం, అత్తిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నా క్లయింబటుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు ఆలమూరి శ్రీదేవి ఈ క్రింది షెడ్యూలు క్రయ దస్తావేజు మడిపల్లి చలపతిరావు, మడిపల్లి ఆదినారాయణ, మడిపల్లి జయసూర్య, మడిపల్లి విష్ణు ఈశ్వర మహేశ్వరరావు, మడిపల్లి శ్రీరామచంద్ర నాగభూషణం, మడిపల్లి లీల రత్నశ్రీ, మడిపల్లి జగదీష్, సన్నిధి తులసి సాయిలక్ష్మి, సన్నిధి జాహ్నవి వెంకటనాగ శ్రీమహాలక్ష్మి గార్ల ద్వారా ది.16-10-2021వ తేదీన అత్తిలి సబ్ రిజిష్టరు వారి వద్ద క్రయం పొందిన రిజిష్టరు డాక్యుమెంటు నెం. 3948/2021. ఈ డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంటు తేదీ 09-09-1985న రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం. 2697/1985. ది.30-03-2023వ తేదీన అత్తిలి నుండి తణుకు నా భర్త అయిన ఆలమూరి గాంధీతో కలిసి బండిపై వెళుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఆ డాక్యుమెంటు ఎవరికైనా దొరికిననూ లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన ఏడు రోజులలోపు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, భీమవరం సబ్ రిజిష్టర్, అత్తిలి సబ్ డివిజన్, అత్తిలి గ్రామ పంచాయితీ అందుల రి.స.నెం. 779/8 దాఖలా చ॥గ॥ 119లు ఖాళీ నివేశ్న స్థలమునకు హద్దులు:
తూర్పు: సన్నిధి ఉమా గారి స్థలం. ***పడమర:*** సన్నిధి శ్రీను గారి స్థలం. ***ఉత్తరం:*** రాజవీధి.
దక్షిణం: మండా మాధవ గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 77023 11197

PUBLIC NOTICE

This Public Notice is given on the instructions of My client **Alamuri Sridevi, W/o. Alamuri Gandhi** of Atili Village, Attili Mandal, West Godavari District.

That my client has acaaired the below mentioned schedule property under a Regd. Sale Deed No. 3948/2021 excuted by Madipalli Chelapati Rao, Madipalli Adinarayana, Madipalli Jaya Surya, Madipalli Vishnu Eswara Maheswara Rao, Madipalli Jagadeesh, Sannidhi Tulasi Sai Lakshi, Sannidhi Jahnavi Venkata Naga Srimahalakshi to that document link document ni. 2697/1985 was lost during my client travelling from attili to tanuku by two wheeler on 30-03-2023. Therefore this public notice is issued to all that anybody has of the said original loost documents /claim /right /objection over the schedule property. There shall came forward with documentary proof within Seven (7) Days from the date of this notice to the undersigned else if shall be deemed that there are no claims (or) objections over the shcedule property, and the transaction will be proceeded with.

DOCUMENT SCHEDULE

West Godavari District, Attili Mandal, Attili Village in R.S.No. 779/8 of Site 119 Sq. Yards following boundaries:
East: Site of Sannidhi Uma 74 Feet.
South: Site of Manda Madhava 14.6 Feet.
West: Site of Sannidhi Srinu 73.9 Feet.
North: Road 14.6 Feet. Within the boundaries site with all easementary rights.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dist.
Cell: 77023 11197